క్లుప్తంగా

పేదలకు రగ్గుల పంపిణీ


పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న సాయి సేవా సమితి ప్రతినిధులు

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారి పాలానికి చెందిన జైగురుదత్త సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అప్పనపల్లిలో సుమారు 40 మంది పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. దీంతో పాటు పశువులకు ఉచితంగా దాణా అందజేశారు. జైగురుదత్త సాయి సేవా సమితి ద్వారా ఏటా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. నిర్వాహకులు బొక్కా హోమసుందర రావు, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, గెద్దం వెంకటేశ్వరరావు, పీఎంపీ కంకిపాటి వెంకటేశ్వరరావు, తులా నాగరాజు, కె.వీరన్న, బి.కోటేశ్వరరావు, పాటి గోవిందు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం పలువురు విరాళాలు అందించారు. అమలాపురం అగ్రహారానికి చెందిన పోతుల దుర్గాప్రసాదరావు–సత్యవెంకటరమణ దంపతులు రూ.20 వేలు, కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన వి.వెంకటనాగసత్యనారాయణ–వెంకటసునీత దంపతులు రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. వారికి అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ఈదురుగాలులకు పడిపోయిన తాటాకిల్లు

మామిడికుదురు: వృద్ధ దంపతులు ఆదమరచి నిద్రిస్తున్న వేళ్ల రాత్రి రెండున్నర గంటల సమయంలో తాటాకు ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ సంఘటన ఆదుర్రులో ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. ఈ ప్రమాదం నుంచి నీలం వీవీసత్యనారాయణ, లక్ష్మి దంపతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రాణపాయం నుంచి వృద్ధ దంపతులు త్రుటిలో తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో చిక్కుకుపోయిన సత్యనారాయణ, లక్ష్మి దంపతులను స్థానికులు అతికష్టం మీద బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితులను సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, స్థానికులు సోమవారం పరామర్శించారు. వారిని ఓదార్చి సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మామిడికుదురు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కడలి గ్రామానికి చెందిన మాదాసి శివకృష్ణ (31) ఆదివారం రాత్రి మృతి చెందాడని నగరం హెడ్ కానిస్టేబుల్ కేవీబీఎస్వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. గత నెల 28న గెద్దాడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడన్నారు. తాటిపాక సెంటర్ నుంచి బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న ఆటో షడన్ బ్రేక్ వేయడంతో ఆటోను బలంగా ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అతడ్ని కుటుంబ సభ్యులు తొలుత అమలాపురం ఆస్పత్రికి అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆస్పత్రికి అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మట్టి అక్రమ తరలింపును నిలిపివేయాలి

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీఎస్‌పీవీ)కి ఆరు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చొప్పెల్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని దళితుల అస్సైన్‌మెంట్ భూముల నుంచి మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రపు కొత్తియ్య వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే గృహ నిర్మాణానికి, ఇళ్ల స్థలాల మంజూరు, పారిశుధ్య పనులకు సంబంధించి దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ రాజు వివరించారు. డీటీ టి.సుబ్బరాజు, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీఓ జి.అరుణకుమారి పాల్గొన్నారు.

గంగిరెద్దుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: అన్ని రంగాల్లో వెనకబడిన గంగిరెద్దుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకుడు రాష్ట్ర ఎంబీసీ (సంచార జాతుల) కమిటీ సభ్యుడు యడ్లపల్లి తుక్కియ్య కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మందికి పైగా గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి వున్నారని, వీరికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రత్యేక దృష్టి పెట్టాలని తుక్కియ్య కోరారు.

పగబట్టిన వాతావరణం

- ఆపదలో ఆదుకోని సర్కార్
- తేమశాతం పేరిట దళారుల దోపిడీ
- చేజారుతున్న చేతికొచ్చిన పంట


వాతావరణ ప్రభావం వల్ల ఆలమూరులో రోడ్డుపైనే ధాన్యాన్ని నిల్వ చేసుకున్న రైతులు


వాతావరణం మార్పులతో ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు

ఆలమూరు: ఫెంగల్ తుపాను రూపంలో వాతావరణం రైతులపై పగబట్టింది. చేతి కొచ్చిన పంట చేజారి పోతుందేమోనని రైతులు ఆందోళనకు గురవుతున్న పరిస్థితి. రైతులు ఎదుర్కొంటున్న ఈ ఆపద సమయంలో ఆదుకోవాల్సిన సర్కార్ మిన్నకుండిపోయింది. దీంతో దళారులు, మిల్లర్లు కలసి రైతు కష్టాన్ని దోచుకునే పనిలో నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా వాతావరణంలో సంభవించిన మార్పులతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రైతులు తాము మసూలు చేసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ధాన్యంలో తేమశాతం తగ్గకపోవడంతో పాటు రోజుల తరబడి నిల్వ ఉంటే బూజు పట్టే అవకాశం ఉన్నందున వరి పంటను అయినకాడికి అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం రాండమైజేషన్ విధానాన్ని అమలు చేయడంతో రైతులు పండించిన ధాన్యాన్ని అంతా దళారులే కొనుగోలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారం యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడంతో రైతులు పండించిన పంటను నేరుగా రైసుమిల్లుకు తీసుకువెళ్లి విక్రయించుకునే పరిస్థితి లేకుండా పోయింది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సీజన్‌కు సంబంధించి 28.5 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. అందులో ఆలమూరు, కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు, మండలాల్లో ఇప్పటికే మాసూళ్లు పూర్తి కాగా సుమారు 80 శాతం మేర రైతులు తమ ధాన్యం ఉత్పత్తులను విక్రయించుకోగా మిగిలిన రైతుల పంట కళ్లాల్లోను, రహదారులపైన బరకాలతో కప్పబడి ఉంది. అలాగే రాజోలు, సఖినేటిపల్లి, అంబాజీపేట, మలికిపురం మండలాల్లోని సుమారు 60 శాతం పంటకు మాసూళ్లు పూర్తికాగా మిగిలిన పంట కోత దశలో ఉంది. కోత దశలో ఉన్న పంట నేలకొరగడంతో ధాన్యం దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తేమశాతం తగ్గింపునకు కుదరని సమయం

వరికోత యంత్రాల ద్వారా పంటను మాసూళ్లు చేయడం ద్వారా వచ్చే ధాన్యాన్ని సుమారు మూడు లేదా నాలుగు రోజుల పాటు ఎండలో ఆరబెట్టవలసి ఉంటుంది. వాతావరణం అంతా మేఘావృత్తం ఉండడంతో గత వారం రోజుల నుంచి ధాన్యాన్ని ఎండబెట్టే పరిస్థితి లేదు. దీనికి తోడు కళ్లాల్లో ఆరబెట్టేందుకు అవసరమైన బరకాల అద్దె రోజురోజుకూ పెరుగుతుండటం రైతుకు భారంగా మారింది. అలాగే పంట అంతా ఒకేసారి రోడ్లపైకి రావడంతో రైతులందరూ తమ ధాన్యాన్ని సంరక్షించుకునే పనిలో నిమగ్నమవడంతో కూలీల కొరత అధికమైంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు నేరుగా విక్రయించుకుంటున్నారు. దీంతో 75 కేజీల ధాన్యం బస్తాకు సగటున రావలసిన రూ.1720లో సుమారు రూ.150 నుంచి రూ.250 వరకూ కోత విధిస్తున్నట్లు తెలుస్తోంది. గోనె సంచె, హమాలీ, రవాణా సదుపాయాలను సమకూర్చుకోలేని రైతులు దళారులు అడిగిన ధరకు అమ్ముకోవలసిన పరిస్థితులు ప్రస్తుతం ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

వాతావరణంలో సంభవించిన మార్పుల దృష్ట్యా ప్రభుత్వం 24 శాతం తేమ వరకూ కొనుగోలు చేయాలని ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో అధికారుల స్పందన అంతంతమాత్రంగానే ఉంది. దీంతో దళారులు, రైసుమిల్లర్లు ఒక అవగాహనకు వచ్చి పద్ధతి ప్రకారం తేమ పేరిట భారీ కోత విధిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. కష్టనష్టాల నడుమ ఆశించిన మేరకు దిగుబడులు సాధించినా మద్దతు ధర దక్కకుండా పోతుందని వారు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి దళారుల బెడద లేకుండా నేరుగా ప్రభుత్వమే జీఎల్‌టీ సౌకర్యాన్ని కల్పించి రైసుమిల్లర్ల నుంచి తగిన గిట్టుబాటు ధరకు ధాన్యం కొనిపించేదని రైతులు చెబుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

4న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష

కొత్తపేట: రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 4న విజయవాడలో తలపెట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ కార్యదర్శి చిక్కాల నరసింహం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 24 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 114, యాక్ట్ 30 ద్వారా ట్రైబల్ వెల్ఫేర్, వైద్య, అటవీ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 3,975 మందిని రెగ్యులర్ చేశారని తెలిపారు. వారందరూ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి శాశ్వత ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. కానీ ఉన్నత విద్యా శాఖ ద్వారా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరణకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి, ఆర్డర్స్ తయారు చేసి ఇచ్చే సమయానికి ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో తమ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి అనేక సార్లు వివిధ రూపాల్లో విజ్ఞాపనలు చేసినా స్పందన లేదని అన్నారు. విధి లేని పరిస్థితుల్లో విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల కాంట్రాక్ట్ అధ్యాపకులతో సత్యాగ్రహ దీక్ష చేపట్టినట్టు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతుల వినతి


నేదునూరులో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

అయినవిల్లి: తుపాన్ కారణంగా వీచిన ఈదురుగాలులకు తమ వరి చేలు నేలనంటాయని, యంత్రాలతో కోత కోసిన ధాన్యం తడిచి మొలకెత్తిందని సోమవారం తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. నేదునూరు, సిరిపల్లి, అయినవిల్లి, మాగం, సిరిపల్లి, విలస గ్రామాల్లో రహదారులపైనే తడిచి ముద్దయిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. అలాగే పంట పొలాల్లో నేలనంటిన వరిచేలను ఏమి చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఏపీ ఎస్సీ వెల్ఫేర్ సంఘం నాయకులు

అయినవిల్లి: మండలంలోని చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తమ వంతు చేయూతనందించారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల జిల్లా కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మండల శాఖ అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. వీరి వెంట ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షుడు బీర సందీప్, గుమ్మడి వెంకట్, డి.సత్యనారాయణ, రాయి వెంకటేశ్వరరావు, మల్లవరపు, చంద్రరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మాసాబత్తుల సురేష్, పరమట నాని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సహనానికి పరీక్ష


పాశర్లపూడిలో అధ్వానంగా జాతీయ రహదారి

మామిడికుదురు: నిత్యం రద్దీగా ఉండే 216వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి చూసి ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి అంతా పక్కాగా ఉన్నా కేవలం కిలోమీటరు రోడ్డు మాత్రం వాహన దారులకు విషమ పరీక్ష పెడుతోంది. పాశర్లపూడిలోని కైకాలపేట నుంచి అమ్మ కాంప్లెక్స్ వరకు సుమారు కిలోమీటరు మేర రోడ్డు నరకం చూపెడుతోందని ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఆ గోతుల్లో వర్షం నీరు నిలిచి పోయి ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులు రోజు రోజుకు అగాధంగా మారడం ప్రయాణికులను కలవరపాటుకు గురి చేస్తోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు అభివృద్ధి సంబంధిత అధికారులకు పట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆకట్టుకున్న త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో సోమవారం జరిగిన త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమం హిందుత్వ వాదులను విశేషంగా ఆకట్టుకుంది. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భక్తబృంద సభ్యులు గ్రామంలో పర్యటించి పవిత్ర మార్గశిర మాసం విశిష్టతను తెలియజేశారు. ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాసంలో చేయవలసిన పూజల ఆవశ్యకతను వివరించారు. హిందుత్వంలోని సంప్రదాయాలను, వేమన భగవాన్ పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేశారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ ఆధ్యాయంలోని 16,17 శ్లోకాల ఆధారంగా పరమాత్మ, ఆత్మ, జీవాత్మల విధానాన్ని వివరించారు. శ్రీఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల బోధనలను ప్రజలకు వివరించారు. అనంతరం హిందూ మత గ్రంథాలను ప్రదర్శించి హిందూమతంలో ఉన్న గొప్పతనాన్ని, ప్రజలందరికీ వివరించాలని భక్తులకు సూచించారు. త్రైత సిద్ధాంత ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను అడ్డుకున్న స్థానికులు


నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న తూరలు

అంబాజీపేట: మాచవరం దొమ్మేటివారిపాలెం వినాయకుడి గుడి వద్ద ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ తూరల నిర్మాణ పనులను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. ప్రధాన రహదారిలో మురుగునీరు దిగేందుకు గతంలో ఏర్పాటు చేసిన తూరలు శిథిలమయ్యాయి. దాంతో తూరకు పెద్ద రంధ్రం ఏర్పడింది. వాటిని తొలగించి నూతన తూరలను ఏర్పాటు చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తూరలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు ఉండుర్తి నాగబాబు, కొల్లూరి దివాకర్‌లతో పాటు పలువురు అడ్డుకున్నారు. తూరలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు పాటించకుండా పనులు చేయవద్దని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనను సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్‌లో తెలియజేశారు. తక్షణమే పనులను తాత్కాలికంగా నిలుపుదల చేసి అధికారుల పర్యవేక్షణ అనంతరం తూరలు ఏర్పాటు చేస్తారని ఆందోళనకారులకు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

కనులపండువగా పోలి స్వర్గం దీపోత్సవం


పి.గన్నవరం గరుడేశ్వరాలయంలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు


పెదపట్నంలంక వైనతేయ గోదావరి నదీతీరంలో భక్తుల పూజలు

మామిడికుదురు: మార్గశిర బహుళ పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం పోలిస్వర్గం దీపోత్సవం కనుల పండుగలా జరిగింది. కార్తికమాసం ముగింపు సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. నదీతీరంలో కార్తిక దీపాలు వెలిగించి వాటికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీపాలను నదిలో వదిలారు. పోలి స్వర్గం దీపోత్సవం వల్ల సకల పాపాలు తొలగి, సద్గతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. పోలి అనే భక్తురాలు అత్త ఆరళ్లను సైతం లెక్క చేయకుండా మార్గశిర పాడ్యమి రోజున కార్తిక దీపాన్ని వెలగించడం ద్వారా స్వర్గ ప్రాప్తి పొందిందని పురాణ కథనం. దీనిని ఆచరించిన భక్తులు తెల్లవారుజామున గోదావరి నదిలో స్నానాలు చేసి దీపాలు విడిచారు. వైనతేయ గోదావరి నదీతీరంలోని గ్రామాల్లో సందడి నెలకొంది. మిగిలిన గ్రామాలకు చెందిన భక్తులు పంట కాలువల్లో దీపాలు వదిలారు. ఆ అవకాశం కూడా లేని వారు మంచినీటి బావుల వద్ద దీపాలు వదిలారు. అనంతరం దేవాలయాలను సందర్శించి కార్తిక మాసం ముగింపు పూజల్లో పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: పవిత్ర కార్తికమాసం ముగిసిన సందర్భంగా సోమవారం భక్తులు పోలిస్వర్గం పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పవిత్ర వశిష్ట, వైనతేయ నదీ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తిక దీపాలు వెలిగించి పోలాంబను స్వర్గానికి సాగనంపారు. అనంతరం శివాలయాలకు వెళ్లి పరమేశ్వరునికి పూజలు చేశారు. దీంతో మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గరుడేశ్వరాలయంలో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చక స్వామి భైరవభొట్ల సత్య వెంకట నారాయణ మూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

అంబాజీపేట: కార్తిక మాసం చివరి రోజు కావడంతో మండలంలోని ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజామునే భక్తులు అధిక సంఖ్యలో ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌశికల వద్ద మహిళలు పోటెత్తి కార్తిక దీపాలను వదలి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అంబాజీపేట, మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హర హర శంభో శంభర.. అశ్శరభ.. శరభ అంటూ భక్తులు నినదించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

కొత్తపేట: వివిధ రూపాల్లో ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి పిలుపునిచ్చారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 'కాలుష్య నివారణ–పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైందన్నారు. 1984లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన నుంచి నేర్చుకోవలసిన పాఠాల ద్వారా కాలుష్య సమస్యలను గుర్తు చేస్తుందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే కంప్యూటర్ లిటరసీ డే ను పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు డాక్టర్ అంకమరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, కడలి ప్రసాద్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

తెరిపినిచ్చిన వరుణుడు


పాశర్లపూడిలో ధాన్యం ఆరబెడుతున్న కూలి

మామిడికుదురు: మూడు రోజులుగా రైతులను ఆందోళనకు గురి చేసిన వాతావరణం సోమవారం తెరిపినిచ్చింది. దీంతో రైతులు కొంత ఉపశమనం పొందారు. కుప్పలు నూర్పి రాశులుగా పోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని మిల్లులకు చేరవేశారు. మామిడికుదురు, పాశర్లపూడి, గెద్దాడ తదితర గ్రామాల్లో బైపాస్ రోడ్డుతో పాటు సువిశాలమైన ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రైతులు ధాన్యం ఎండబెడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఆరబెట్టిన ధాన్యాన్ని సమీప రైసు మిల్లులకు తరలించే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. మరో వైపు పంట పొలాల్లో నిలిచిన వర్షపునీటిని రైతులు బాటలు తీసి బయటకు పంపించి పంటను రక్షించుకునే చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దిగబడులు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

వరిచేల పరిశీలన

అయినవిల్లి: మండలంలోని తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరిచేలను మండల వ్యవసాయశాఖ అధికారి వై.శోభ సోమవారం పరిశీలించారు. శానపల్లిలంక, మాగం, నేదునూరు, విలస తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. తుపాను కారణంగా వీచిన గాలులకు పడిపోయి దెబ్బతిన్న వరిచేలను ఆమె పరిశీలించారు. ఆలాగే కళ్లాల్లో తడిచి ముద్దయిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. పలువురు రైతులు ఆమెను కలసి తుపాన్ కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

బాలిక, మహిళా చట్టాలను అవగాహన చేసుకోవాలి


కొత్తపేటలో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: సమాజంలో బాలికలు, మహిళలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని ముందుకు వెళ్లాలని రావులపాలెం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఇటీవల మహిళలు, యువతులు, బాలికలపై జగురుగుతున్న దాడులు, హత్యాచారాల నేపథ్యంలో బాలికలు, యువతులు, మహిళల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై సోమవారం సాయంత్రం స్థానిక కాంతిభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పోలీసు శాఖ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ టి.దొరబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుకు వెళుతున్న నేటి సమాజంలో స్వీయ రక్షణలోనూ తమ సమర్థతను చాటాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులకు వివిధ రూపాల్లో ఎదురైన సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. అన్ని విషయాలను తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. ఏ సమస్య ఎదురైనా ఏదో జరుగుతుందని భయపడకుండా ధైర్యంగా 100, 112కు ఫోన్ చేసి రిపోర్టు చేస్తే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సదస్సులో స్థానిక ఎస్సై జి.సురేంద్ర, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: స్థానిక సమతా కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి మండల యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ సందేశాన్ని యువత పాటించి, నేటి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ఎమ్మెల్యే అన్నారు. సమతా కల్యాణ మండపం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తగిన నిధులను సమకూర్చగలమని తెలిపారు. అలాగే ఇందుకు గాను త్వరలో దళిత క్రైస్తవ సమాజంతో కమిటీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్య ప్రసంగీకులు జాన్ మంగాచార్యులు, క్రీస్తు జననం ప్రాధాన్యతను వివరించారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసెడెంట్ పాస్టర్ జి.చార్లెస్ షారోన్‌కుమార్ అధ్యక్షతన వహించిన వేడుకల్లో ఎంపీపీ వీరా మల్లిబాబు, బిషప్ శామ్యూల్ ఫిన్నీ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.